తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
సోమవారం
3 ఆగస్టు 2026
పేజీలు : 08



# రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి



- రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా
- డిసిసిబి డైరెక్టర్,ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా

**కడ్తాల్ ఆగష్టు 02(జనంసాక్షి):** రక్తదానం ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతుందని, రక్తదానం చేసేందుకు యువకులు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా,డిసిసిబి డైరెక్టర్,ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా,లు అన్నారు. ఆదివారం కడ్తాల్ పట్టణంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ ఆధ్వర్యంలో తలసేమియా బాధిత చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిథులుగా హాజరైన ఉప్పల వెంకటేష్ గుప్తా,గంప వెంకటేష్ గుప్తాలు ప్రారంభించారు.అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి యువతి యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయడం వల్ల ఆపద సమయంలో ఏవైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం చాలా అవసరం అవుతుందని అన్నారు.అలాంటివారికి మీరు ఇచ్చే రక్తం ఒకరి ప్రాణాలు కాపాడవచ్చునని గుర్తు చేశారు.అదేవిధంగా తల సేమియా వ్యాధితో బాధపడే వారు వైద్యుల సూచన మేరకు 15 లేదా 20 రోజుల కోసారి రక్తం అవసరం అవుతుందని సరైన సమయానికి రక్తం అందకపోతే వారి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు.మీరు ఇచ్చే రక్తం వారి ప్రాణాన్ని నిలబెడుతుందని వారన్నారు.ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం లో స్వచ్ఛందంగా 60 మంది పాల్గొని రక్తదానం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను నాయక్,రైతు సమన్వయ సమితి సభ్యులు మంగళపల్లి నరసింహ, రావిచెడు ఉపసర్పంచ్ యాదయ్య,రావిచెడు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమేష్,మాజీ ఎంపిటిసి లచ్చిరాం నాయక్,అమృతం పాండు, సురేష్, దాసు, ఏ.సురేందర్, జి.శ్రావణ్ కుమార్, విశ్రాంత్, రషీద్, శశికాంత్, గౌస్, రాకేష్, అబ్బ రమేష్, వెంకటేష్, శ్రీకాంత్, మహేష్, రాకేష్, ఒగ్గు మహేష్ తదితరులు పాల్గొన్నారు.




### కడ్తాల్ పట్టణంలో ఘనంగా స్నేహితుల దినోత్సవం

స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం.. స్నేహానికన్న మిన్న లోకాన లేదురా..అంటూ కడ్తాల్ లో స్నేహితుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.ఆదివారం ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్తా,డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్నేహితులందరూ ఏర్పాటుచేసిన కేక్ ను కట్ చేసి ఒకరికొకరు అలింగనం చేసుకొని స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం వారందరూ ఒకే చోట చదువుకున్న తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.ఆపద సమయంలో స్నేహితులు అండగా నిలవాలని ఎవరికి ఏ ఆపద వచ్చినా ఒకరికొకరు సహాయం చేసుకుంటూ ఆనందంగా జీవించాలని కోరారు.



## ఎస్ఐఆర్ ఫార్మ్స్‌ను బీఎల్ఓలకు అందజేసిన ఏర్పుల కుమార్

**రాజేంద్రనగర్,ఆగస్టు2(జనంసాక్షి):** ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్ మణికొండలో తన ఎస్ఐఆర్ ఫార్మ్స్‌ను పూర్తి చేసి సంబంధిత బీఎల్ఓలకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ఫార్మ్స్‌ను సరైన వివరాలతో నింపి నిర్ణీత గడువులోగా బీఎల్ఓలకు సమర్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాసాని పుల్లారావు, సురేష్ గౌడ్, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# తాండూరులో అత్యాధునిక రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభం

### శ్రీ బాలాజీ నర్సింగ్ హోమ్‌లో డా. బి. విహాసిత్ ఆధ్వర్యంలో సేవలు




తాండూరు, ఆగస్టు 2(జనంసాక్షి) : పట్టణ ప్రజలకు అత్యంత ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు కీళ్ల మార్పిడి, రోబోటిక్ శస్త్రచికిత్సల కోసం హైదరాబాద్ వంటి మెట్రో నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఇక ఉండదు.పట్టణంలోని డి.సి.ఎం.ఎస్. ఎదుట, చించోలి రోడ్డులో మార్గంలో ఉన్న శ్రీ బాలాజీ నర్సింగ్ హోమ్‌లో ఇప్పుడు అన్ని రకాల ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డా. బి. విహాసిత్ ఎం.బి.బి.ఎస్, ఎం.ఎస్,ఎఫ్ఐ.జె.ఆర్, ఎప్ఐ.ఎ ఆధ్వర్యంలో ఈ వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. డా. బి. సంపత్ కుమార్ కుమారుడైన డా. విహాసిత్ ట్రా మా, స్పోర్ట్స్ మరియు జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ ప్రత్యేక నైపుణ్యం కలిగి ఉన్నారు. హైదరాబాద్‌లో రోబోటిక్ కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో ఆయనకు విశేష అనుభవం ఉంది.
ఆసుపత్రి యాజమాన్యం తెలిపిన ప్రకారం, ఇక్కడ అత్యాధునిక పరికరాలతో రోబోటిక్ సాంకేతికత ద్వారా కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల రోగికి నొప్పి తక్కువగా ఉండి, త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది. అందించే చికిత్సలు: విరిగిన ఎముకలకు శస్త్రచికిత్స, మోకాలు, కీళ్ల నొప్పులకు చికిత్స,భుజం, మెడ, నడుము నొప్పులకు చికిత్స ,ఆర్థరైటిస్ / కీళ్లవాతం చికిత్స, మోకాలి నరం తెగడం - ఆర్థ్రోస్కోపీ మోకాలు, తుంటి, భుజం మార్పిడి శస్త్రచికిత్సలు ప్రతి శనివారం మరియు ఆదివారం డా. విహాసిత్ స్వయంగా ఓపిడిలో రోగులను పరీక్షించి చికిత్స సూచిస్తారు. తాండూరుతో పాటు పరిసర మండలాల ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆసుపత్రి యాజమాన్యం కోరింది. సంప్రదింపులకు ఫోన్: 9121670108, 9912839934, 9505864619.నంబర్ లకు సంప్రదించాలని కోరారు.

## పట్నం కుటుంబానికి సానుభూతి తెలిపిన ఆర్టిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి


లోపలి పేజీలో



## బహదూర్గూడలో రైతుల ఆందోళన

### దీక్షలను నిలిపివేసిన పోలీసులు

**శంషాబాద్, ఆగస్టు 2 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా బహదూర్గూడలో భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం భూములు సేకరించవద్దని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలను పోలీసులు ఆదివారం అడ్డుకున్నారు. దీక్షలకు సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములకు తగిన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ తమ నిరసనను కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు.

## ఇంటర్-డిస్ట్రిక్ట్ తైక్వాండోలో సంస్కృతి స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**చేవెళ్ల, ఆగస్టు 02 (జనంసాక్షి):** వికారాబాద్‌లో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్-డిస్ట్రిక్ట్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో చేవెళ్ల సంస్కృతి స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం ఆరు పతకాలు సాధించారు. ఇందులో నాలుగు బంగారు, ఒక రజత, ఒక కాంస్య పతకం గెలుచుకుని పాఠశాలకు కీర్తి తీసుకొచ్చారు. పోటీల్లో ఆరో తరగతి విద్యార్థులు రిత్విక్ రెడ్డి, సాత్విక్ రెడ్డి, కుశాల్, ఐదో తరగతి విద్యార్థిని వేదశ్రీ బంగారు పతకాలు సాధించారు. అలాగే ఐదో తరగతి విద్యార్థి మణికృష్ణ అర్జున్ రజత పతకాన్ని, నాలుగో తరగతి విద్యార్థి మేదాన్ష్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విజేతలను పాఠశాల డైరెక్టర్ శశి పాల్ రెడ్డి, ప్రిన్సిపాల్ రెహానా, ఉపాధ్యాయులు అభినందించి ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఆగస్టు 9న ఘనంగా బోనాల వేడుకలు.. మూడు కాలనీల్లో ఏర్పాట్లు ముమ్మరం

- శివారెడ్డిగూడ, మారుతీనగర్, శ్రీనిధి నెస్ట్ కాలనీల పెద్దల సమావేశం..
- భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయం

**ఘట్‌కేసర్, ఆగస్టు 2 (జనం సాక్షి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని శివారెడ్డిగూడ, మారుతీనగర్, శ్రీనిధి నెస్ట్ కాలనీలలో ఈ నెల 9న జరిగే బోనాల మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కాలనీల ప్రతినిధులు, పెద్దలు సన్నాహాలు ప్రారంభించారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ, భక్తుల సౌకర్యాలు, కార్యక్రమాల రూపురేఖలపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను మూడు కాలనీల ప్రజలంతా ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అమ్మవారికి బోనాలు సమర్పించడం, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించి ఆధ్యాత్మిక వాతావరణంలో వేడుకలను జరపాలని నిర్ణయించారు. ఉత్సవాల విజయవంతానికి ప్రతి కుటుంబం తమవంతు సహకారం అందించాలని, యువత, మహిళలు, కాలనీవాసులు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కాలనీల పెద్దలు పిలుపునిచ్చారు. పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు పరిశుభ్రత, భద్రతా చర్యలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కంది ప్రవీణ్ కుమార్, మడిపడిగె ఆంజనేయులు, మడిపడిగె రాజ్‌కుమార్, లంబ శ్రీనివాస్ యాదవ్, మెడబోయిన సంజీవ్ ముదిరాజ్, వై. నితిన్ రెడ్డి, జి. సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొని ఉత్సవాల విజయవంతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## పట్నం కుటుంబానికి సానుభూతి తెలిపిన ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

**తాండూరు అగస్టు 2(జనంసాక్షి) :** మాతృవియోగానికి గురైన పట్నం కుటుంబ సభ్యులను ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఆదివారం మొయినాబాద్ మండలంలోని జీపీఎల్ కన్వెన్షన్‌లో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. దివంగత రుక్కమ్మ ఆత్మకు నివాళులర్పించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. దివంగత రుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అభిమానులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చేవెళ్ల మున్సిపల్ పరిధలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**చేవెళ్ల, ఆగస్టు 02 (జనంసాక్షి)** ఆషాఢ మాసం సందర్భంగా చేవెళ్ల పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని అమ్మవారికి సమర్పించగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని న్యూ జర్నలిస్టు కాలనీ, వీరభద్ర కాలనీ, సీపీఐ కాలనీ, టీచర్స్ కాలనీ, మధురనగర్, అయ్యావారి కాలనీ, అంగడి బజార్ కాలనీ, వెంకటరమణ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, చంద్రారెడ్డి కాలనీ, రంగారెడ్డి కాలనీతో పాటు మండలంలోని మల్కాపూర్, పామెన, ఆలూరు తదితర గ్రామాల్లో బోనాల వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. బోనాల సందర్భంగా మహిళలు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని గ్రామదేవతలను ప్రార్థించారు. బోనాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగాయి. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కౌన్సిలర్ బండారి శైలజా ఆగిరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు




**మోమిన్ పేట, ఆగస్టు 2 (,జనం సాక్షి) :** ప్రతి ఏడాది వచ్చే ఆషాడ మాసంలో గ్రామదేవతలకు బోనాలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా, మోరంగపల్లి గ్రామంలో కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గొల్ల బీర్లొల్ల పోతురాజు విన్యాసాల మధ్య గ్రామం లోని ప్రధాన వీధుల నుండి బోనాలతో వచ్చి గ్రామదేవతలు, శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీ దుర్గమ్మ తల్లి దేవతలకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణ బిచ్చయ్య , మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మానేయ యాదవ్, పెద్ద గొల్ల మల్లయ్య, ఉగ్గేల్లి మానేయ, రాజేందర్, వార్డు సభ్యులు దేవరాజ్, పులిగారిబాబు, గొల్ల కురుమ యాదవ సంఘం నాయకులు సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కి నైవేద్యాలు బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాది పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. గ్రామస్తులంతా ప్రతి ఏడాది ఆషాడ మాసంలో కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాల కార్యక్రమం నిర్వహించడం వల్ల గ్రామస్తులు అంత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మా గ్రామంలో ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఏడాది ఇలాగే నిర్వహించాలని వారు కోరుకున్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- గడ్డం మల్లయ్య గూడ గ్రామ మాజీ సర్పంచ్ అచ్చన జంగయ్య



యాచారం, ఆగష్టు 2(జనంసాక్షి) : మండల పరిధిలోని గడ్డమల్లయ గూడ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి , ఎల్ఓసీ చెక్కులను గ్రామ మాజీ సర్పంచ్ అచ్చన జంగయ్య ఆదివారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చింతపల్లి విజయమోహన్ రెడ్డికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 45 వేల రూపాయలు, అలాగే దండు జంగయ్య కుమార్తె వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్ఓసీ ద్వారా ₹2లక్షల 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఎమ్మెల్యే రంగారెడ్డి చొరవతో నిధులు త్వరగా మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కాలే వెంకటేష్, ఆర్ల జంగయ్య, బొడ్డు శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ యార అశోక్, కాంగ్రెస్ మాజీ మండల వైస్ ప్రెసిడెంట్ అవ బీరప్ప, సీనియర్ నాయకులు మైలారం పాండురంగ రెడ్డి, అచ్చన యాదయ్య, వరికుప్పల చంద్రయ్య, ఇక్కే జంగయ్య, ఇక్కే శ్రీశైలం, ఎడ్ల శ్రీనివాస్, మరియు గ్రామస్తులు వరికుప్పల కృష్ణ, నర్రె శంకరయ్య, వరికుప్పల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మౌలాలి హెచ్‌బి కాలనీ పద్మశాలి సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గం ఎన్నిక అధ్యక్షుడిగా కొంపల్లి చంద్రమోహన్



**కాప్రా , ఆగస్టు 2 (జనం సాక్షి) :** మౌలాలి హెచ్‌బి కాలనీలోని శ్రీ మార్కండేయ పద్మశా లి సంక్షేమ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా కొంపల్లి చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా దుడుక లక్ష్మీనారాయణ, కోశాధికారిగా జీ.సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మాకం అంజయ్య, ఏ. శ్రీహరి సంయుక్త కార్యదర్శులుగా పి. జగన్నాథ్ పి. వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏం. వినోద్ కుమార్, ఆడెపు పెంటయ్య, బి చంద్రశేఖర్, సలహాదారులుగా మామిడాల శ్రీపతి, వడిచర్ల గోపాల్, విజయ్ కుమార్ బేతి పాండు, ఉదయ్ చంద్ర, జి సూర్య ప్రకాష్, మరో 10 మంది కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారు

## జాయ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఐబీఎస్ విద్యార్థుల సేవా కార్యక్రమం.

### వృద్ధులతో గడిపిన ప్రతి క్షణం మాకు పాఠమే..విద్యార్థులు



**శంకర్ పల్లి, ఆగస్టు 02 (జనం సాక్షి) :** ఐబీఎస్ హైదరాబాద్‌కు చెందిన మరియు క్లబ్ ఐనా సంయుక్త ఆధ్వర్యంలో మొకిల గ్రామంలోని జాయ్ ఫౌండేషన్ సొసైటీ వృద్ధాశ్రమంలో ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు,విద్యార్థి వాలంటీర్లు వృద్ధులతో ఆప్యాయంగా గడిపారు.వారి జీవిత అనుభవాలు,మధుర జ్ఞాపకాలను ఆసక్తిగా ఆలకించారు. అనంతరం వినోదాత్మక ఆటలు, పాటలు, నృత్యాలతో వృద్ధాశ్రమాన్ని ఆనందంతో నింపారు. విద్యార్థులు,వృద్ధులు కలిసి గడిపిన క్షణాలు వృద్ధాశ్రమంలో ఆప్యా యత, చిరునవ్వుల వాతావరణాన్ని సృష్టించాయయి ఈసందర్భంగానిర్వాహకులు మాట్లాడు తూ.. వృద్ధులను గౌరవించడం,వారికి సమయం కేటాయించడం వంటి చిన్న చర్యలే వారికి గొప్ప ఆనందాన్ని ఇస్తాయి.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, మానవీయ విలువలను పెంపొందిస్తాయిఅని అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు జట్టుగా పనిచేయడం, పెద్దల పట్ల గౌరవం, సానుభూతిని నేర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని అందంగాచిత్రీకరించిన నజారియా బృందానికి, అంకుష్ మరియు ఆయన బృందానికి సిడబ్ల్యుడి క్లబ్ ఐనా కృతజ్ఞతలు తెలిపాయి. భవిష్యత్తులో కూడా విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

# రక్తదానం-ప్రాణదానంతో సమానం

### లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు




**తలకొండపల్లి ఆగష్టు 02(జనంసాక్షి):**
రక్తదానం ప్రాణదానంతో సమానమని,అత్యవసర పరిస్థితుల్లో దాతలు ఇచ్చే రక్తం ప్రాణాలను నిలబెడుతుందని లింగారావుపల్లి సర్పంచ్ లయన్ కాసు శ్రీనివాస్ రెడ్డి,డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ లయన్ మిట్టపల్లి సునంద అన్నారు. తలకొండపల్లి మండలం రామకృష్ణ పురంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ (డిస్ట్రిక్ట్ 320ఎ)ఆధ్వర్యంలో దివంగత జి.అంజి రెడ్డి స్మారకార్థం ఘనంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ రక్తదాన శిబిరాన్ని లింగారావుపల్లి సర్పంచ్ లయన్ కాసు శ్రీనివాస్ రెడ్డి,లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ కార్యదర్శి లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి,సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవ రెడ్డి,డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ లయన్ మిట్టపల్లి సునంద అంజయ్య,లయన్ జూలూరి రమేష్,లయన్ బండెల రామచంద్ర రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రక్తదానం అత్యున్నత మానవ సేవ అని,ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి అవసరమైన వారికి ప్రాణదాతగా నిలవాలని పిలుపునిచ్చారు.దివంగత జి. అంజిరెడ్డి జీవితకాలంలో ఎన్నోసార్లు రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారని,వారి సేవా స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు.ఈ శిబిరంలో యువత,స్వచ్ఛంద రక్తదాతలు విశేషంగా స్పందించి 40 మంది రక్తదానం చేశారు.కార్యక్రమానికి క్యాంప్ చైర్మన్ లయన్ పి.అంజి రెడ్డి నాయకత్వం వహించగా,లయన్స్ క్లబ్ సభ్యులు పిఆర్ఓ పాష,గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి,కోటేశ్వర్ రెడ్డి,రంజిత్ రెడ్డి,కోటి రెడ్డి,యువత,మహిళలు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నిరాశ్రయులు, సంచారజాతులవారికి దుస్తులు, ఔషధాలు పంపిణీ



**ముషీరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌ల మీద జీవనం సాగిస్తున్న నిరాశ్రయులు, సంచారజాతుల కుటుంబాలకు దుస్తులు అందించి సామాన్య రుగ్మతలతో బాధపడుతున్న వారికి ఔషధాలు పంపిణి చేసామని స్కై ఫౌండేషన్ తెలిపింది. సమాజంపట్ల సామాజికబాధ్యతతో నిరంతరం విభిన్న సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు పేర్కొంది. బోనాల పండుగ సందర్భంగా దుస్తులు అందుకున్నామని వాళ్ళ సంతోషాన్ని స్కై ఫౌండేషన్‌తో పంచుకొని కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని. ఓ. తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం



**హుజూర్‌నగర్, ఆగస్టు 2 (జనంసాక్షి) :** హుజూర్‌నగర్ పట్టణంలోని పీర్ల కొట్టం బజార్‌లో నివాసం ఉంటున్న భూతం లక్ష్మీ ప్రసన్న భర్త మణి అనే మహిళ కుటుంబ కలహాలతో ఎవరికీ చెప్పకుండా ఆదివారం ఇంటి నుండి వెళ్లిపోయింది. ఆమె తల్లి కదిరబోయిన స్వరూప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ లభించినట్లయితే హుజూర్ నగర్ ఎస్సై, సిఐ లకు తెలియజేయాలని కోరారు.

## ప్రపంచంలో అత్యంత విలువైనది స్నేహం



**కోదాడ (జనంసాక్షి) :** కోదాడ పట్టణంలోని 30వ వార్డులో ఈరోజు స్నేహితుల దినోత్సవ సందర్భంగా 30వ వార్డు కౌన్సిలర్ ఉమఅంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా స్నేహితుల దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్న అనంతరం ఉమాఅంజన్ గౌడ్ మాట్లాడుతూ ఈ సృష్టిలో కల్మషం లేనిది స్నేహమేనని స్నేహానికి వయస్సు కులం దేశం అంటూ హద్దులు లేవని మనుషులు నిజమైన స్నేహం చేయాలని అన్నారు ఈ కార్య క్రమంలో గునగంటి రాధిక, బత్తిని నాగమణి, అనురాధ, లక్ష్మి, నిర్మల, తేజ, సుజాత, ఉష, అశ్విని, వరలక్ష్మి, విజయ, మధు, శైలజ, రమ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి తల్లి రుక్కమ్మకి ఘన నివాళులు అర్పించిన నాయకులు



**శామీర్‌పేట్, ఆగష్టు 2 (జనంసాక్షి) :** శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తల్లి,మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పట్నం సునీతా మహేందర్ రెడ్డి అత్త పట్నం రుక్కమ్మ దశదిన కర్మ కార్యక్రమం ఆదివారం హిమాయత్‌నగర్‌లోని జేపీఎల్ కన్వెన్షన్‌లో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షులు గువ్వ రవి ముదిరాజ్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్ యాదవ్ హాజరై పట్నం రుక్కమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం వారు పట్నం మహేందర్ రెడ్డి,పట్నం సునీతా మహేందర్ రెడ్డిను మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని పొందాలని ఆకాంక్షించారు.

# వైద్యాన్ని వ్యాపారంగా మార్చొద్దు

**ప్రభుత్వ వైద్య వ్యవస్థ బలోపేతమే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది**

**ఎయిమ్స్ వైద్య నిపుణుడు డాక్టర్ విజయ్‌కుమార్**

**సిపిఎం ఆధ్వర్యంలో "ప్రజా ఆరోగ్యం - ప్రభుత్వాల బాధ్యత" అంశంపై సెమినార్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్ట్ 02 (జనంసాక్షి) :** ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వాల ప్రధాన బాధ్యత అని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయాలని ఎయిమ్స్ వైద్య నిపుణుడు డాక్టర్ విజయ్‌కుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. వైద్య సేవలు ప్రజల హక్కుగా అందాలని, వ్యాపార ధోరణులకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ లోని డాక్టర్ ఎస్.రావునగర్ డివిజన్ లోని సీనియర్ సిటిజన్ హాల్‌లో ఆదివారం "ప్రజా ఆరోగ్యం -ప్రభుత్వాల బాధ్యత" అంశంపై నిర్వహించిన సదస్సులో పలువురు వక్తలు ప్రజారోగ్య సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జె.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో ఎయిమ్స్ వైద్య నిపుణుడు డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు అనారోగ్యానికి గురికాకముందే ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం అత్యంత అవసరమన్నారు. కోవిడ్ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్య వ్యవస్థల లోపాలను బయటపెట్టిందని పేర్కొన్నారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం, ముందస్తు ప్రణాళికల లోపం కారణంగానే అనేక దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. వైద్య విద్యలో నాణ్యత, వైద్యులకు శిక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణపై ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. కార్పొరేట్ వైద్య రంగం సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మోపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం నిర్దేశించిన విద్య, వైద్య హక్కులను ప్రజలకు పూర్తిస్థాయిలో అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. వైద్యాన్ని పూర్తిగా వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను విరమించుకోవాలని కోరారు. ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ రంగ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య రంగంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు ప్రజా ఆరోగ్యంపై పెట్టుబడులు పెంచాలని సూచించారు. సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. పారిశుధ్యం, స్వచ్ఛమైన తాగునీరు, విద్య వంటి మౌలిక అంశాలపై దృష్టి సారిస్తే అనేక వ్యాధులను నివారించవచ్చున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రుల సంఖ్యను పెంచడంతో పాటు ఖాళీగా ఉన్న వైద్య పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కోమటి రవి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శ్రీనివాసులు, ఎం.వినోద్, ఎర్ర అశోక్, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.శ్రీనివాస్, ఆర్.సంతోష్, లింగస్వామి, జి.లక్ష్మణ్, పార్టీ సీనియర్ నాయకులు యాదయ్య, సోమయ్యచారి, పటాకి శ్రీనివాస్, గణేష్, యాదగిరిరావు, మంగ తదితరులు పాల్గొన్నారు.





## అమ్మ సేవ ఫౌండేషన్ ఫర్ హ్యూమానిటీ

**ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన, వైద్య శిబిరం**



**నిజాంపేట్, ఆగస్ట్ 2 (జనంసాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామం శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం సమీపంలో ఆదివారం అమ్మ సేవా ఫౌండేషన్ ఫర్ హ్యూమానిటీ (ఏ.ఎస్ ఎఫ్ హెచ్ ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరం ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని స్వయంగా రక్తదానం చేసి, అనంతరం ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడడంతో పాటు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ సభ్యులు వై. చరిత్ కుమార్, కే. విగ్నేష్, విశాలి బెలే, సుజన్, డి. అజయ్ యాదవ్, భార్గవ్, నవ్య, సాయి స్నేహిత్, రాహుల్ దాస్, అభినవ్ సాయి, రోహిత్, విజయ్, కృష్ణవేణి, మహేందర్, కీర్తి, వరుణ్, అభిషేక్, రేణుక, పావని, నల్ల నాగుల కృష్ణ, జ్ఞానేశ్వర్, కనకయ్య, డి. శ్రీనివాస్, వేణు, కుంట అర్జున్ ముదిరాజ్, అరుణ్ డాక్టర్, తులసి, సాయి రెడ్డి, మహేష్, శ్రావణ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహం ప్రపంచాన్ని మార్చిన మహా శక్తి

**బిజెపి నాయకులు, సామాజిక సేవకులు శ్రీరామ్ వెంకటేష్**

సంపద మనిషిని ధనవంతుడిని చేస్తుంది.. స్నేహం మనిషిని మహోన్నతుడిని చేస్తుంది. చరిత్రను పరిశీలిస్తే ప్రపంచాన్ని మార్చిన ప్రతి గొప్ప నాయకుడి వెనుక ఒక మంచి స్నేహితుడు, ఒక నమ్మకమైన సహచరుడు కనిపిస్తాడు. నిజమైన స్నేహం వ్యక్తిగత జీవితాన్నే కాదు, దేశాల భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తుంది. **శ్రీరాముడ- హనుమంతుడు**

ప్రపంచంలో విశ్వాసానికి నిలువెత్తు నిదర్శనం. హనుమంతుడు స్నేహాన్ని లాభనష్టాలతో కొలవలేదు. రాముడి కష్టాన్ని తన కష్టంగా భావించి జీవితాన్ని అంకితం చేశాడు. నిజమైన స్నేహితుడు అవసరమైన సమయంలో ముందుగా నిలబడతాడని ఈ బంధం చెబుతుంది.

**శ్రీకృష్ణుడు- సుదాముడు**

పేదరికం, సంపద, హోదా... ఏవీ నిజమైన స్నేహానికి అడ్డుకావని ఈ స్నేహం ప్రపంచానికి నేర్పింది. కాలం మారినా, పరిస్థితులు మారినా మనసులు మారకపోవడమే స్నేహం.

**చాణక్యుడు- చంద్రగుప్తుడు**

ఒకరి మేధస్సు, మరొకరి ధైర్యం కలిసి భారత చరిత్రను మార్చాయి. మంచి స్నేహితుడు మన బలాన్ని గుర్తించి గొప్ప లక్ష్యాల వైపు నడిపిస్తాడు. మహాత్మా గాంధీ తన సహచరులతో విశ్వాసపూర్వక బంధాలను నిర్మించి స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దారు. నెల్సన్ మండేలా జైలులో గడిపిన సంవత్సరాల్లో కూడా సహచరులపై నమ్మకాన్ని కోల్పోలేదు. స్నేహం, విశ్వాసం, క్షమాభావం ఒక దేశాన్ని ఏకం చేయగలవని నిరూపించారు.

అబ్దుల్ కలాం ఎప్పుడూ చెప్పేవారు జ్ఞానాన్ని పంచుకునే మిత్రులు జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతారని. ఈరోజు రాజకీయాలు, వ్యాపారం, సమాజం ప్రతి రంగంలో స్నేహం అనే పదానికి కొత్త అర్థాలు వస్తున్నాయి. ప్రయోజనం ఉన్నంత వరకు ఉండే బంధాలు స్నేహం కావు. పదవి ఉన్నప్పుడు దగ్గరగా ఉండి, కష్టం వచ్చినప్పుడు దూరమయ్యే వారు మిత్రులు కాదు.

నిజమైన స్నేహితుడు..
విజయాన్ని చూసి చప్పట్లు కొట్టేవాడు కాదు; అపజయంలో చేయి పట్టేవాడు.
పొగిడేవాడు కాదు; తప్పు చేస్తే ధైర్యంగా చెప్పేవాడు.
అవసరానికి గుర్తుకొచ్చేవాడు కాదు; అవసరం రాకముందే తోడుగా నిలిచేవాడు.
స్వార్థం కోసం దగ్గరవాడు కాదు; విలువల కోసం నిలిచేవాడు.

స్నేహంపై చిరస్మరణీయ వాక్యాలు
"సుఖంలో నీతో నవ్వేవారు చాలామంది ఉంటారు...
కష్టంలో నీతో నడిచేవాడే నిజమైన స్నేహితుడు."
"రక్త సంబంధం దేవుడు ఇస్తాడు...
హృదయ సంబంధం స్నేహం ఇస్తుంది."
"పదవులు మారవచ్చు... సంపద తగ్గవచ్చు...
కానీ విశ్వాసంతో నిలిచిన స్నేహం శాశ్వతం."
"నిజమైన స్నేహితుడు నీ విజయాన్ని చూసి అసూయపడడు...
నీ అపజయాన్ని చూసి దూరం కాడు.





# దండుమైలారం అభివృద్ధి ప్రదాత తాడూరి

## ప్రజా ప్రతినిధిగా నాలుగు దశాబ్దాలకుపైగా జనార్దన్‌రెడ్డి సేవ

**సర్పంచ్‌గా 26 ఏళ్లు..**

**పదవులకే పరిమితం కాని ప్రజా జీవితం**

**సహకార రంగంలో**
**దశాబ్దాల ప్రస్థానం**
**గ్రామానికి విద్యుత్ నుంచి పాఠశాల నిర్మాణం**
**ఆసుపత్రి, తాగునీరు, పేదల ఇళ్ల వరకు..**
**అభివృద్ధి కార్యక్రమాల్లో తనదైన ముద్ర**

**రంగారెడ్డి, ఆగస్టు 2 (జనంసాక్షి)**

రాజకీయాలను ఆస్తులు సంపాదించుకునే మార్గంగా చూసే రోజులివి. కానీ, అదే రాజకీయాన్ని ప్రజాసేవకు, గ్రామ ప్రగతికి మార్గంగా మలుచుకుని తన సొంత ఆస్తులనే ఊరి కోసం ధారపోసిన అరుదైన నాయకుడు తాడూరి జనార్దన్ రెడ్డి. నాలుగు దశాబ్దాల పాటు ప్రజాప్రతినిధిగా, సహకార రంగ సారథిగా ఆయన అందించిన సేవలు దండుమైలారం చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో నిలిచిపోతాయి. కేవలం ఒక నాయకుడిగానే కాకుండా, ఊరి బాగుకోసం తపించే 'శ్రీమంతుడి'గా 'తాడూరి' దండుమైలారం గ్రామానికి చేసిన సేవలు నేటికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి.

1964లో ఉప సర్పంచ్‌గా ప్రారంభమైన ఆయన ప్రజా ప్రస్థానం.. 1969లో సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించడంతో కీలక మలుపు తీసుకుంది. 1995 వరకు దాదాపు 26 ఏళ్లపాటు గ్రామ సర్పంచ్‌గా కొనసాగారు. అదే సమయంలో సహకార రంగంలోనూ తన ప్రస్థానాన్ని కొనసాగించారు. 1968 నుంచి 2013 వరకు మధ్యలో తొమ్మిదేళ్ల విరామాన్ని మినహాయిస్తే, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా దీర్ఘకాలం సేవలందించారు. 1995 నుంచి 2013 వరకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్‌గా కూడా వ్యవహరించారు. ఈ సుదీర్ఘ కాలంలో దండు మైలారం గ్రామానికి అవసరమైన పలు మౌలిక వసతుల ఏర్పాటులో ఆయన చొరవ కనిపించింది. తాడూరి జనార్దన్‌రెడ్డి ప్రజా జీవితానికి ఆయన సతీమణి తాడూరి భారతమ్మ కూడా భాగస్వామ్య మయ్యారు. ఆమె ఐదేళ్లపాటు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. దీంతో కుటుంబంలోని ఇద్దరు వ్యక్తులు వేర్వేరు దశల్లో గ్రామ పాలనలో బాధ్యతలు చేపట్టినట్టయింది. జనార్దన్‌రెడ్డి ప్రారంభించిన ప్రజా సేవా ప్రస్థానానికి భారతమ్మ కూడా తన వంతు సహకారం అందించారు.

**విద్యుత్ కోసం తొలి అడుగు..**

ప్రస్తుతం గ్రామ జీవితంలో విద్యుత్ అనేది సాధారణ సౌకర్యంగా కనిపించినా.. గతంలో గ్రామాల విద్యుదీకరణ ఒక పెద్ద ప్రక్రియ. దండుమైలారం గ్రామానికి కూడా ఆ సౌకర్యం తీసుకురావడంలో జనార్దన్‌రెడ్డి చొరవ చూపారు. 1967లో గ్రామానికి విద్యుత్ సదుపాయం కల్పించేందుకు కృషి చేశారు. గ్రామ అభివృద్ధికి విద్యుత్ అవసరాన్ని ముందుగానే గుర్తించి, సంబంధిత అధికారులతో





సమన్వయం చేస్తూ ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లినట్లు స్థానికంగా గుర్తింపు పొందారు.

**పాఠశాల కోసం సొంత ఖర్చుతో భూమి..**

గ్రామాభివృద్ధిలో విద్యకు ప్రాధాన్యం ఇచ్చారు. 1983లో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణం కోసం సొంత ఖర్చుతో ఎకరం భూమిని కొనుగోలు చేసి దానం చేశారు. నేడు కొనసాగుతున్న పాఠశాల జనార్దన్ రెడ్డి సహకారంతో నిర్మించినదే . ఒక నాయకుడి రాజకీయ పదవిని మించి.. స్థానిక అవసరానికి అనుగుణంగా వ్యక్తిగత వనరులను వినియోగించిన ఉదాహరణగా పాఠశాల ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వైద్య వసతుల అవసరాన్ని కూడా ఆయన గుర్తించారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం కోసం మరో రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసి అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సదుపాయాల విస్తరణ పరిమితంగా ఉన్న సమయంలో ఆసుపత్రి కోసం భూమి సమకూర్చడం ప్రాధాన్యతను సంతరించుకుంది.



**ఆధ్యాత్మిక క్షేత్రాల్లో భాగస్వామ్యం..**

గ్రామ సామాజిక, ఆధ్యాత్మిక జీవితంలోనూ జనార్దన్‌రెడ్డి భాగస్వామ్యమయ్యారు. 1985లో రామాలయం, వేణుగోపాల స్వామి ఆలయాల నిర్మాణానికి కృషి చేశారు. బీరప్ప గుడి నిర్మాణం కోసం ఒక ఎకరం భూమిని కొనుగోలు చేసి అందించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాల నిర్మాణానికి సహకరించడం ఆయన ప్రజా జీవితంలో మరో కోణాన్ని చూపించింది.

**పేదల ఇళ్ల స్థలాలకు భూమి**

గ్రామంలోని నిరుపేద కుటుంబాల నివాస సమస్యపైనా ఆయన దృష్టి సారించారు. ముదిరాజుల కిందబస్తీ పేదల కోసం ఎకరం భూమిని కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలకు కేటాయించారు. దీంతో పాటు గ్రామంలోని పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు అందేలా చర్యలు తీసుకుని 400 మందికి ఇళ్ల మంజూరుకు కృషి చేశారు. గృహం అనేది ఒక కుటుంబానికి ఆర్థిక భద్రతకు పునాది అనే కోణంలో పేదల అవసరాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

**నీటి వనరులపై దృష్టి..**

వ్యవసాయ ఆధారిత గ్రామానికి నీటి వనరులు కీలకం. దండుమైలారంలోని చెరువులకు నీరు చేరేలా బూరుబండ కాలువ నిర్మాణానికి ఆయన చొరవ చూపారు. ఇక, తాగునీటి అవసరాల కోసం తలగొండ చెరువు నుండి బోరు ద్వారా నీటిని అందించేలా బోరు వేయించి, సుమారు మూడు కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటు చేయించారు. గ్రామ ప్రజల తాగునీటి అవసరాలకు ఈ వ్యవస్థ ఉపయోగపడేలా చర్యలు తీసుకున్నారు.

**సహకార రంగంలో సుదీర్ఘ ప్రస్థానం..**

జనార్దన్‌రెడ్డి ప్రజా జీవితంలో మరో ముఖ్యమైన అధ్యాయం సహకార రంగం. 1968 నుంచి 2013 వరకు, మధ్యలో తొమ్మిదేళ్ల విరామాన్ని మినహాయించి, ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. సహకార సంఘం భవన నిర్మాణం కోసం ఎకరా 20 గుంటల భూమిని కొనుగోలు చేసి అందించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సహకార రంగం పాత్రను దృష్టిలో పెట్టుకుని సంస్థాగత వసతుల ఏర్పాటుకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. అనంతరం 1995 నుంచి 2013 వరకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్‌గా పనిచేశారు. దీంతో గ్రామస్థాయి సహకార వ్యవస్థ నుంచి జిల్లా స్థాయి సహకార రంగం వరకు ఆయన ప్రజా సేవలో తనదైన ముద్ర వేశారు.

**కమ్యూనికేషన్ వ్యవస్థలోనూ చొరవ..**

దండుమైలారాన్ని ఆధునిక సౌకర్యాలతో అనుసంధానించే క్రమంలో కమ్యూనికేషన్ వ్యవస్థ విస్తరణకు కూడా ఆయన సహకరించారు. గ్రామంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయించడంలో చొరవ చూపారు. అప్పటి కాలంలో టెలిఫోన్ సౌకర్యం గ్రామీణ ప్రాంతాల్లో అరుదుగా ఉండేది. కమ్యూనికేషన్ వ్యవస్థ విస్తరణ గ్రామాన్ని బయటి ప్రాంతాలతో మరింత అనుసంధానించే అంశంగా నిలిచింది.

**ఒక గ్రామం అభివృద్ధికి సాక్ష్యంగా..**

దండుమైలారం అభివృద్ధిని ఒకే కాలపరిమితిలో చూడలేం. దశాబ్దాలుగా జరిగిన అనేక కార్యక్రమాల సమాహారమే నేటి గ్రామ రూపురేఖలు. ఆ పరిణామక్రమంలో తాడూరి జనార్దన్‌రెడ్డి పాత్రను స్థానికంగా ప్రత్యేకంగా ప్రస్తావిస్తారు. 1964లో ఉప సర్పంచ్‌గా ప్రారంభమైన ప్రజా జీవితం.. సర్పంచ్‌గా 26 ఏళ్ల సేవ, సహకార రంగంలో దీర్ఘకాల బాధ్యతలు, జిల్లా సహకార బ్యాంకులో పదవి వరకు కొనసాగింది. విద్యుత్, విద్య, వైద్యం, నీరు, గృహ వసతులు, ఆలయాలు, కమ్యూనికేషన్, సహకార రంగం వంటి విభిన్న అంశాల్లో ఆయన చొరవ చూపారు. వ్యక్తిగత రాజకీయ ప్రస్థానంతో పాటు ఒక గ్రామ అవసరాలను కేంద్రంగా చేసుకుని సాగిన ఈ సేవా ప్రస్థానం.. దండుమైలారం సామాజిక, మౌలిక అభివృద్ధి చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది.

